ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025
5
అనంతపురం

బడా సుబ్బిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు

పేదలే లక్ష్యంగా దా'రుణం'..!



- గృహ రుణాల పేరుతో మోసం
- మంజూరు చేసిన రుణం రూ.3.17 లక్షలు
- ఖాతాలో జమ చేసింది రూ.2 లక్షలే..!
- పేదల రక్తం పీలుస్తున్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్
- కలెక్టర్ స్పందించాలంటూ బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-హిందూపురం

పేదలపై ప్రయివేటు కార్పొరేట్ ఫైనాన్స్ దా'రుణం' ఆగడం లేదు. కష్టంలో ఉన్న వారికి రుణాలు ఇస్తున్నట్లు నటించి నిబంధనల మాటును వారి రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారు. హిందూపురం ప్రాంతంలో వందలాది మంది ఇలా ఓ ప్రయివేటు ఫైనాన్స్‌లో డబ్బులు తీసుకుని ఏళ్ల తరబడి కంతులు చెల్లిస్తున్నా రుణ విముక్తి కాక వడ్డీ కూపంలో కూరుకుపోయారు. హిందూపురం కేంద్రంగా ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఇంటి పత్రాలను తనాఖా పెట్టుకుని రుణాలను ఇస్తుంది. ఇచ్చిన రుణాలకు వాయిదాల పద్ధతుల్లో వడ్డీతో కలిపి కంతులను తీసుకుంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా రుణం మంజూరులో లెక్కలేనన్ని నిబంధనలతో జనం నెత్తిన టోపీ పెడుతున్నారు. పేదలు తీసుకున్న రుణం మొత్తం వడ్డీలకే సరిపోతుండడంతో ఏళ్లు గడుస్తున్నా అసలు తీరే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో బాధితులు నిత్యం ఆ ఫైనాన్స్ సంస్థ వద్దకొచ్చి వారి గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థ పేదలను లక్ష్యంగా చేసుకుని వారి అవసరాలను ఆసరాగా చేసుకుని ఇంటి పత్రాలను తనఖా పెట్టుకుని రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నట్లు ఆశ పెడుతున్నారు. తీసుకున్న రుణాలకు సంబంధించి ప్రతినెలా సిబ్బంది చెప్పిన విధంగానే నెలవారి కంతులను చెల్లిస్తున్నారు. రుణం పొందిన పేదలు చెల్లిస్తున్న నెలవారి కంతులు ఫైనాన్స్ సంస్థ వడ్డీలకు వడ్డీ వేసి వారు కడుతున్న కంతులను ఇచ్చిన రుణానికి వడ్డీ రూపంలోనే జమ చేసుకుంటున్నారు. చెల్లించే కంతులను వడ్డీ కింద ఫైనాన్స్ సంస్థ జమ చేసుకుంటే, తీసుకున్న రుణాలు ఎప్పుడు తీరుతాయని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ స్పందించాలి

ప్రయివేటు సంస్థలు ఇచ్చిన రుణాలు, కంతుల చెల్లింపు విధానంపై కలెక్టర్ స్పందించి ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే ఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని, నేటికీ వడ్డీలు చెల్లిస్తున్న వివరాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు బాధితులు చెబుతున్నారు. ఈ ఫైనాన్స్ రుణ మంజూరుపై సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులూ కోరుతున్నారు.

రుణం మంజూరు కాక పోయినా వాయిదాలను ఎందుకు చెల్లించాలని వాదిస్తున్న మాబుసాబ్ కుమారుడు షెక్షావలి

21 నెలలు కంతులు కట్టినా వడ్డీకే సరి..!

చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామానికి చెందిన సరోజమ్మ తనకున్న స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకుని తన సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలనుకుంది. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఈమెకు ఇళ్లు మంజూరు కాలేదు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు హిందూపురం పట్టణంలో ఉన్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌ను సంప్రదించింది. తన స్థలానికి సంబంధించిన పత్రాలను చూపించి, 2022 సంవత్సరం ఆగస్టులో రుణంకు దరఖాస్తు చేసుకుంది. సంస్థ ప్రతినిధులు అన్ని పత్రాలనూ పరిశీలించిన అనంతరం ఆమెకు రూ.3,17,844 మంజూరు చేసింది. ఇందులో ఫైనాన్స్ సంస్థ ఫీజులు పోగా మిగిలిన రూ.2,89,630 సంస్థ మంజూరు చేసింది. మంజూరు చేసిన నగదులో తొలివిడత ఆగస్టు 27వ తేదీన సరోజమ్మ ఖాతాకు రూ.1,00,681 జమ చేసింది. రెండవ విడత 2023వ సంవత్సరం జూన్ నెలలో రూ.1లక్షను ఫైనాన్స్ సంస్థ జమ చేసింది. మిగిలిన డబ్బులను ఇంతవరకు ఫైనాన్స్ సంస్థ సరోజమ్మ ఖాతాకు జమ చేయలేదు. రుణ మంజూరు సమయంలో ఇంటి నిర్మాణం పూర్తి అయిన తర్వాతే ఫైనాన్స్‌కు చెల్లించాల్సిన నెల వారి కంతులు చెల్లించాలని సిబ్బంది తెలిపారు. నెల వారి కంతులు రూపంలో నెలకు ఆమె రూ.3,812 సంస్థకు చెల్లిస్తోంది. ఇలా ఇప్పటికి 21 నెలలకు ఫైనాన్స్ సంస్థకు రూ.80 వేలు చెల్లించింది. ఈ చెల్లించిన మొత్తం వడ్డీకే సరిపోయిందని, అసలు ఇంకా రూ. 3.17 లక్షలు చెల్లించాల్సి ఉందని ఫైనాన్స్ సిబ్బంది తెలపడంతో సరోజమ్మ ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడింది. ఇదే విషయంపై ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కార్యాలయానికి వచ్చి తన ఆవేదనను కన్నీరు కార్చుకుంటూ కార్యాలయంలో ఉన్న సిబ్బంది ముందు పోయింది.

రుణం ఇవ్వకుండానే ఇచ్చినట్లు మోసం...

సోమందేపల్లి చెందిన మహబూబ్ కూతురికి వివాహం నిశ్చయం అయ్యింది. డబ్బులు తక్కువగా ఉండడంతో తన ఇంటిని తాకట్టుపెట్టి డబ్బులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో హిందూపురంలోని ఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో ఇంటిని తాకట్టు పెట్టి రుణం పొందేందుకు అక్కడి సిబ్బందిని సంప్రదించాడు. ఇంటి పత్రాలను చూసిన సిబ్బంది అగ్రిమెంట్ చేయడానికి రూ.3 వేలు చెల్లించాలని, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్టిగేజ్ చేయించాలని సూచించారు. దానికి అతను రూ.6 వేలు ఖర్చు చేసుకున్నాడు. అనంతరం పరిశీలనకు వచ్చిన ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ డబ్బునూ అతను ఇచ్చాడు. అన్నీ పూర్తయిన తర్వాత మాబుసాబ్‌కు రూ.3.18లక్షలు మంజూరు అయినట్లు, లోన్ ప్రాసెసింగ్ ఫీజు పట్టుకుని మిగిలిన రూ 2.90 లక్షలు ఖాతాకు జమ అయినట్లు సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్ అయితే వచ్చిందిగానీ ఇప్పటి వరకు డబ్బులు మాబూసాబ్ ఖాతాకు జమ కాలేదు. డబ్బులు జమ కాకపోయినప్పటికీ మొదటి నెల వాయిదా కంతును చెల్లించాలని సంస్థ నుంచి ఫోన్లు వచ్చాయి. కంగుతిన్న అతను పట్టణంలో ఉన్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కార్యాలయంకు వచ్చి తన ఆవేదనను సిబ్బంది ముందు వ్యక్తం చేశారు. కార్యాలయంలో తన రుణానికి సంబంధించి పరిశీలన చేస్తే పత్రాలు సరిగా లేకపోవడంతో రుణం మంజూరు కాలేదని సిబ్బంది చెప్పారు. రిజిస్టర్ పత్రాలు లేని కారణంగా రుణం మంజూరు కాదని వారు పేర్కొన్నారు. రుణం ఇవ్వక పోవడంతో తన ఇంటికి సంబంధించిన పత్రాలను ఇవ్వాలని సిబ్బందిని ఆయన అడిగాడు. రూ.1300 చెల్లించి, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్టిగేజ్‌ను రద్దు చేసుకుని వచ్చి దానికి సంబంధించిన పత్రాలను ఇచ్చిన వారం తర్వాత ఇస్తామని అక్కడి సిబ్బంది చెప్పారు. రుణం ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డులు సృష్టించి, ఇప్పుడు రద్దు చేయాలని చెప్తే ఎందుకు చేయరని ఆయన సిబ్బందితో వాదించారు. రుణం మంజూరు కాకపోయినప్పటికీ దాదాపు రూ.15 వేలకు పైగా ఖర్చుపెట్టుకున్నానని, ఇప్పుడు మళ్లీ రద్దు చేయడానికి రూ.5వేలు ఖర్చు అవుతుందన్నారు. తన వద్ద డబ్బు లేదని సిబ్బంది ముందు కన్నీరు కార్చినప్పటికీ, ఫైనాన్స్ సిబ్బంది నిబంధనల పేరుతో అతన్ని బయటకు పంపారు.

బడా సుబ్బిరెడ్డి మృతి రైతు ఉద్యమానికి

తీరని లోటు

సంతాప సభలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడా సుబ్బిరెడ్డి మతి రైతు ఉద్యమానికి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వి.రాంభూపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బడా సుబ్బిరెడ్డి సంతాప సభను మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు హాజరై బడా సుబ్బిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సుబ్బిరెడ్డి 25 సంవత్సరాలుగా కదిరి ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న కరువు, వలసలు, సాగునీరు, పంటల నష్టపరిహారం, పట్టు రైతుల సమస్యలపై నిస్వార్థంగా, అవిశ్రాంతంగా పోరాటాలు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, ప్రస్తుత శ్రీసత్యసాయి జిల్లాలో రైతు సంఘాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లడంలో సుబ్బిరెడ్డి చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. పాడి రైతుల ఉద్యమం నుంచి రైతు ఉద్యమంలోకి వచ్చిన సుబ్బిరెడ్డి సిపిఎం విధానాలు, పోరాటాలపై అక్షర్షితులై ఆ పార్టీ కదిరి డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి అనంతపురం జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లాల్లో జిల్లా కమిటీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా పని చేసి ఆదర్శవంతమైన సేవలు అందించారని కొనియాడారు. కరవు నివారణ కోసం సాగునీటి ప్రాజెక్టుల పోరాటం, కరువు సహాయక చర్యల కోసం రైతుల పక్షాన ఆయన చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. సుబ్బిరెడ్డి మరణం రైతు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, సిఐటియు నాయకులు టి.రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, ఎన్.మధుసూదన్ నాయుడు, విరుపాక్షి, రాజారాం రెడ్డి, బిహెచ్.రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు పోతులయ్య, ఈరప్ప, నారాయణరెడ్డి, వలీ, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, వెంకట నాయుడు, కొండారెడ్డి, దేవేందర రెడ్డి, పుష్పరాజు, సువర్ణమ్మ, చిదంబరమ్మ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

నాటుసారా రహిత 'అనంత'గా మారుద్దాం

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ కోరారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో నవోదయం 2.0పై ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా పని చేయాలన్నారు. అనంతపురం జిల్లా కర్ణాటక ప్రాంతానికి అంతర్రాష్ట్ర సరిహద్దు ఉన్న నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మరింత నిఘాను పెంచాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలన్నారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. నాటుసారా నిర్మూలనపై క్షేత్రస్థాయిలో తనిఖీలు జరగాలన్నారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీపై డ్రోన్‌ల ద్వారా తనిఖీలు చేయాలని ఆదేశించారు. అనంతరం నవోదయం 2.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కేశవనాయుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, డివిఇఒ వెంకటరమణ నాయక్, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ కార్మికుడు మృతి

టిడిపి, సిఐటియు నాయకుల నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మృతదేహాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

నగరపాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుడు సూర్యనారాయణ అనారోగ్యంతో మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకుల ద్వారా విషయం తెలుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లాలని స్థానిక టిడిపి నేతలను ఆదేశించారు. దీంతో టిడిపి నాయకులు గంగారామ్, రమణ, లక్ష్మీనరసింహ, ఇతర నాయకుల ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు నాగరాజు, సిఐటియు నాయకులు వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనంత కథా సాహిత్యానికి చిరస్మరణీయుడు 'సింగమనేని'

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంత కథా సాహిత్యానికి జీవం పోసిన సింగమనేని నారాయణ చిరస్మనీయుడు అని పలువురు వక్తలు కొనియాడారు. శింగమనేని వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని కమలానగర్‌లో ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ, శ్రీసాయి డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌కెయు తెలుగు శాఖ అకాడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, కవులు కంబదూరు షేక్ నబిరసూల్, జెట్టి జయరామ్, అలీఖాన్, చెట్ల వీరన్న మాట్లాడుతూ రాయలసీమ కరువు పరిస్థితులపై అద్భుతమైన కథలు రాయడమే కాకుండా కథా సంకలనాలు రావడానికి సింగమనేని తీవ్రంగా కృషి చేశారన్నారు. కథా రచయిత మాత్రమే కాదు గొప్ప సాహిత్య విమర్శకులు అన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు వెలుగు సంస్థ టీవీ రెడ్డి, కె.అల్తాఫ్ పుస్తకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పామిరెడ్డి దామోదర్‌రెడ్డి, సుబ్బరాయుడు, భయపరెడ్డి, రాహుల్, చెట్ల ప్రవీన్, భానుప్రకాష్, విజయభాస్కర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సింగమనేని నారాయణకు నివాళులర్పిస్తున్న అతిథులు

నిలిచిన సెంట్రల్ ల్యాబ్ పనులు

ప్రజాశక్తి-యల్లనూరు

పిల్లర్ దశకే పరిమితమైన పనులు

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో చేపట్టిన సెంట్రల్ ల్యాబ్ పనులు అర్ధాంతరంగా ఆగాయి. సెంట్రల్ ల్యాబ్ వల్ల ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయడాన్ని సులువు చేస్తూ ప్రభుత్వం ఈ కేంద్రం నిర్మాణ పనులను చేపట్టారు. అనంతపురం జిల్లా సెంట్రల్ ఆరోగ్య కమిటీ సబ్ కాంట్రాక్టుకు నిర్మాణ పనులను అప్పజెప్పారు. ప్రారంభ దశలో పనులు ముమ్మరంగా సాగాయి. తర్వాత నెమ్మదించాయి. ఆతర్వాత పనులను ఆర్ధాంతరంగా ఆపేశారు. ప్రస్తుతం పిల్లర్స్‌కు వేసిన కడ్డీలు వంగిపోయాయి. ఈ ల్యాబ్ నిర్మాణ జరిగి అందుబాటులోకి వస్తే ప్రజలు వివిధ రకాల పరీక్షలకు ప్రయివేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేసి ల్యాబ్‌ను అందుబాటులోకి తేస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రజలు, వైద్యుడు వైద్యుడు లోకేష్ కుమార్ అభిప్రాయ పడుతున్నారు.

మామిడి రైతులకు రాయితీతో ఫ్రూట్ కవర్లు

ఉద్యానవనశాఖ అధికారిణి శైలజ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మామిడి రైతులకు రాయితీతో ఫ్రూట్ కవర్లు అందజేస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ తెలిపారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని బొమ్మలాటపల్లి గ్రామంలో మామిడిలో ఫ్రూట్ కేర్కే యాక్టివిటీ ఫుడ్ కవర్స్‌పై క్షేత్రస్థాయిలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి పిందె దశ నుంచి నిమ్మకాయ లేదా గోలీసైజులో ఉన్నప్పుడు ఈ ఫ్రూట్ కవర్లు తొడగడం వల్ల కాయకు మంగు మచ్చలు, రంగు, మామిడి టెంక పురుగు, పండు ఈగ, వివిధ పురుగులు, తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ ఫ్రూట్ కవర్లను ప్రభుత్వం 50శాతం రాయితీతో ఇస్తున్నట్లు తెలిపారు. పదెకరాల పొలంలో సాగు చేసిన మామిడి చెట్లకు 10 వేల కవర్లకు రూ.2 చొప్పున రూ.20వేలు అవుతుందన్నారు. అయితే ప్రభుత్వ రాయితీ రూ.10వే పోతే మిగతా సొమ్ము రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారరు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు వెంకట్‌రెడ్డి, కుల్లారెడ్డి, కెకె అగ్రహారం మాజీ సర్పంచు గోవిందరెడ్డి, రైతు సేవా సిబ్బంది నవ్య, నదియా, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

కవర్లపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

పోస్టుకార్డులను పోస్టులో వేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులతో కలిసి మంగళవారం పోస్టుకార్డులను పోస్టాఫీస్ ద్వారా సిఎం చంద్రబాబుకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకుంటే ముందుగా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తుందని ఆశించిన కార్మికులకు నిరాశ మిగిల్చిందని ఆవేదనను వ్యక్తం చేశారు. కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. గతంలో ఇదే చంద్రబాబు ప్రభుత్వంలో 279 జీవో తీసుకొచ్చి ప్రయివేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పజెప్పి ఎంత ఇబ్బందులకు గురి చేశారనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఆందోళనలకు శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోశాధికారి రాము, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపి అంబికా

గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులుఓ భాగంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులుతో కలిసి పాఠశాలలో భోజన వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివే ప్రతి పేద విద్యార్థికీ ప్రభుత్వం నుంచి వచ్చే సౌకర్యాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు చక్కటి క్రమశిక్షణ నేర్పించాలని, పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. భోజనం బాగుందని, అయితే ఇంకా చిన్న చిన్న మార్పులు చేస్తే మరింత రుచిగా ఉంటుందని సూచించారు. ఇకనుంచి తాను ఎప్పుడైనా ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి, రిటైర్డ్ హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం కౌన్సిల్ మీట్‌లో రగడ

సమావేశం వాయిదా

ప్రజాశక్తి-రాయదుర్గం



వాదులాడుకుంటున్న కౌన్సిలర్లు

రాయదుర్గం పురపాలక మండలిలో అధికార పాలకమండలి, వైసిపికి చెందిన వార్డు సభ్యుల మధ్య వాగ్వివాదం, వర్గ విభేదాల కారణంగా మంగళవారం నిర్వహించిన పురపాలక మండలి సాధారణ సమావేశం వాయిదా పడింది. ముందుగా సగం మంది సభ్యులతో కౌన్సిల్ సమావేశం మొదలైంది. సిబ్బంది అజెండా చదువుతుండగా సభ్యుడు బండి అజయ్‌కుమార్ జోక్యం చేసుకుని కోరం లేకుండా సమావేశాన్ని ఎలా జరుపుతారని కమిషనర్ దివాకర్‌రెడ్డిని ప్రశ్నించారు. మూడోవంతు సభ్యులు ఉంటే సమావేశం నిర్వహించవచ్చని కమిషనర్ వివరణ ఇచ్చారు. గతంలో 50శాతం వస్తేగాని సభ జరపలేదని అజయ్ తెలిపారు. కాగా బయటి వ్యక్తి కౌన్సిల్ హాలులో ప్రవేశించి వీడియోను ఎలా చిత్రీకరిస్తారని వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. ఇతర సభ్యులు కొందరు మాట్లాడుతూ రూ.50వేలు డబ్బు తీసుకుని సమావేశానికి హాజరవుతారా? అని ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ శిల్ప ప్రకటించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో ఇరువర్గాలకు చెందిన సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఛాంబర్ బయట కూడా ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం ఛైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన కొందరు సభ్యులు తనపై అవిశ్వాసానికి ప్రయత్నించినట్లు చెప్పారు. అయినప్పటికీ పార్టీ అధిష్టానం మార్చే ఉద్దేశం లేదని చెప్పినట్లు తెలిపారు. దీంతో కోపోద్రిక్తులైన అసమతి వర్గీయులు తనతోపాటు మహిళా సభ్యులపై అసభ్యంగా దూషించినట్లు ఆరోపించారు. వైస్‌ఛైర్మన్ వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్‌పర్సన్, కుటుంబ సభ్యులు పురపాలక మండలిని తమ వ్యక్తిగత కుటుంబంగా భావించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. టిడిపి సభ్యులు ప్రశాంతి, పద్మజ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన సభ్యులే అసమ్మతిగా ఏర్పడి పురపాలక మండలి సమావేశం హుందాగా జరగాల్సి ఉండగా ఘర్షణ చోటు చేసుకోవడం విచారకరమన్నారు.

ఇవిఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత ఉండాలి

కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ఇవిఎంల లాక్ పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇవిఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని పాత ఆర్‌డిఒ కార్యాలయం సమీపంలో ఉన్న ఇవిఎం గోడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోడౌన్ వద్ద భద్రతా చర్యలు, లాక్‌బుక్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎం గోడౌన్‌ల వద్ద సెక్యూరిటీ లాక్‌బుక్‌లు అందరికీ అర్థమయ్యేలా నమోదు చేయాలన్నారు. లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఏఎస్‌ఐని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఏ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజ్ పాల్గొన్నారు.

చికెన్, గుడ్డుపై అపోహలొద్దు..

ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో చికెన్, గుడ్డు పంపిణీ

చికెన్, గుడ్డు అందజేస్తున్న రమేష్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

చికెన్, గుడ్డు తినకూడదనే వదంతులను ఎవరూ నమ్మొద్దని వెన్‌కాబ్ వెంకటేశ్వర హేచరీస్ ఎజిఎం రమేష్ సూచించారు. మంగళవారం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్, గుడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత వేడి వద్ద చికెన్, గుడ్డును ఉడికించి తినడం వల్ల ఎలాంటి అనారోగ్యం ఇబ్బందులు రావన్నారు. ప్రజల్లో అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వెన్‌కాబ్ వెంకటేశ్వర హేచరీస్ మార్కెటింగ్ మేనేజర్ త్యాగరాజు, రెడ్డి కోళ్లఫారం పాపిలి రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ చికెన్ సెంటర్ కళ్యాణదుర్గం రోడ్డు ప్రొప్రైటర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అతిథికి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సురేష్‌బాబు వ్యక్తి వ్యక్తిగత, వృపరమైన వృద్ధికి అవసరమైన జీవిత నైపుణ్యం, ఫైనాన్సియల్ లిటరసీ ద్వారా ఆర్థిక లావాదేవీలు ఎలా నిర్వహించాలి.. అప్పుల పరిస్థితులను ఎలా నివారించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యు.శ్రీనివాసులు, హెచ్‌ఎస్ విభాగం హెచ్‌ఒడి జె.గురుసిద్ధప్ప, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ టి.వెంకట నాగజయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు చిన్న పుల్లయ్య, సి.లక్ష్మీనారాయణ, అరవింద్‌బాబు, వై.మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని విసి రిసీవర్

పని చేయని విసి రిసీవర్ ముందు అధికారులు

యల్లనూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో వీడియో రిసీవర్లు పని చేయకపోవడంతో అధికారులు నానాతంటాలు పడ్డారు. మంగళవారం ఎపి పంచాయతీ రాజ్ కమిషనర్ సెక్రటరేటియట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల అధికారులు విసి రిసీవర్ పని చేయకపోవడంతో విసిలో ఏం జరుగుతుందో తెలియక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విసి రిసీవర్లను బాగు చేయాలని మండల అధికారులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే వైవిఆర్‌ను కలిసిన నాయకులు

మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గుత్తి వైసిపి నాయకులు

గుత్తి : మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మండలానికి చెందిన వైసిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వంగా కలిశారు. ఇందులో భాగంగా పట్టణ, మండల కమిటీల్లోని ఇతర పదవులు, వివిధ విభాగాల కమిటీలపై వైవిఆర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ,మండల కన్వీనర్లు కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజు, నాయకులు హుస్సేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, ఎం.రంగస్వామి, ఎన్.సి.రంగయ్య, కె.కృష్ణమోహన్‌నాయుడు, కొత్తపేట రాము, ఎస్.సుధాకర్, బి.సురేష్, శంకర్‌రెడ్డి, మల్లి, బ్రహ్మేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట కార్డులకు నమోదు చేసుకోండి

రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ పద్మజ

ఉరవకొండ : రైతులు తప్పనిసరిగా విశిష్ట అపార్ కార్డులు చేయించుకోవాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ సూచించారు. మంగళవారం ఉరవకొండ మండల పరిధిలోని రాయంపల్లి, వ్యాసాపురం గ్రామాల్లో రైతులకు 11 అంకెల రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడిఎ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రతి రైతు కచ్చితంగా అపార్ కార్డు చేయించుకోవాలన్నారు. అనంతరం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు ఆయా పంటలకు సంబంధించిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శుభకర్, గ్రామ నాయకులు ఓబుళరెడ్డి, రాయంపల్లి, వ్యాసాపురం రైతు సేవాకేంద్ర సిబ్బంది సి.మీనాక్షి, కె.వన్నప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా నిత్యావసరాలు పంపిణీ చేయాలి

మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

బొమ్మనహాల్ : చౌకధాన్య డిపోల ద్వారా వినియోగదారులకు సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ మునివేలు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చౌకధాన్య డిపోల ద్వారా అందించే సరుకులు పేదలకు సకాలంలో చేరాలంటే డీలర్లు సక్రమంగా పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ, ఇఒఆర్‌ఆర్, డీలర్లు పాల్గొన్నారుట.

మహారాజశ్రీ రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No: 242 of 2023
Between:
ఎమ్.హనుమంత రెడ్డి ...వాది
యెదిరి
కె.గోవింద రెడ్డి ...ప్రతివాది
To,
కె.గోవింద రెడ్డి S/o కె.లింగా రెడ్డి, కలేకుర్తి గ్రామము, కనేకల్లు మండలం.
సమన్లు
వాది ప్రామిసరి నోటు బాపత్తు వసూలు నిమిత్తం మీపై, పై దావా దాఖలు చేయడమైనది.కావున మీరు పై కోర్టులో తేది:11/03/2025న ఉదయం10:30 గంటలకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గానీ హాజరై, ఆన్సరు దాఖలు చేసుకోవాలి.అట్లు మీరు హాజరు కాని యెడల పై దావా మీ పరోక్షమందు తీర్మానిచబడునని తెలియచేయడమైనది.
(By Order of the Court)
గౌని వెంకట రెడ్డి,
వాదితరుపు న్యాయవాది, రాయదుర్గం.

సామాజిక పింఛన్ల తనిఖీ

శింగనమల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం సామాజిక పింఛన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతివారం ఒక వైద్యుడు మూడు రోజులపాటు రోజూ 50 సామాజిక పింఛన్లు పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తరిమెల సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ హరిణి, కల్లుమడి డిజిటల్ అసిస్టెంట్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.


పింఛనుదారులను పరిశీలిస్తున్న వైద్యులు

థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్‌పై మడత పేచీ..!

నిప్పు రాజేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు..?

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో గత కొన్ని నెలలుగా థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ నిర్వహణకు నిర్వహించిన టెండర్లను పలుమార్లు వాయిదా వేస్తూ చివరకు ఓ కంపెనీకి వర్క్ ఆర్డర్ ఇచ్చారు. వర్క్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల అండదండలు పుష్కలంగా కలిగిన కర్నూల్ కాంట్రాక్టర్‌కు బాసటగా నిలుస్తూ నిప్పు రాజేశారన్న చర్చ నడుస్తోంది. ఈ నెలాఖరున సూపరింటెండెంట్ ఇంజినీర్ భాస్కరరావు ఏడాది సర్వీస్ ఉండగానే విఆర్‌ఎస్ తీసుకుని ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ సైతం ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టెండర్ ఖరారైనా కన్సల్టెంట్‌కు వర్క్ ఆర్డర్ ఎలా ఇస్తారు అంటూ ముఖ్య నేత వద్ద టెండర్ దక్కించుకోలేకపోయినా కర్నూల్ కాంట్రాక్టర్ తగవుకు దిగినట్లు తెలిసింది. టెండర్ నిబంధన ప్రకారం అర్హత కలిగిన ఎస్ఆర్ కన్సల్టెంట్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం వర్క్ ఆర్డర్ తీసుకున్న సంస్థను పనులు చేయనీకుండా కొందరు ఇంజినీరింగ్ అధికారులు కర్నూలు కాంట్రాక్టర్‌ను ఎగదోసి అడ్డంకులు సృష్టించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఆ కాంట్రాక్టర్ నేరుగా ముఖ్య నేత వద్ద పంచాయితీ పెట్టి ఇతరులకు ఇచ్చిన వర్క్ ఆర్డర్‌ను రద్దుచేసి తనకు కేటాయించాలని గొడవకు దిగినట్లు సమాచారం. టెండర్ నిబంధనలు మార్చి రెండోసారి నిర్వహించినా సదరు కర్నూలు కాంట్రాక్టర్ అర్హత సాధించలేకపోయారు. దీంతో తప్పనిసరిగా ఎస్సార్ కన్సల్టెంట్‌కు కార్పొరేషన్ అధికారులు వర్క్ ఆర్డర్ ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. ఇంజినీరింగ్ అధికారుల అండదండలు పుష్కలంగా కలిగిన స్థానికేతర కాంట్రాక్టర్ మాత్రం థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ టెండర్ తగ్గించుకున్న కన్సల్టెంట్ వర్క్ ఆర్డర్ రద్దు చేయించే దిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ముఖ్య నేతకు పరిస్థితిని వివరించి టెండర్ దక్కించుకున్న వ్యక్తితో పనులు చేయించాల్సిపోయి అడ్డంకులు సృష్టిస్తున్న కొందరు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అనంత నగరాభివృద్ధి విషయంలో పాలకవర్గం ఒకవైపు అధికార పార్టీ నేత మరో వైపు అన్న చందంగా పాలన కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలో ముఖ్య నేతలు విమర్శలు చేసుకోవడంలోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల సైతం పరిస్థితిని వివరించి అభివద్ధి పనులతోపాటు కార్యాలయ కార్యక్రమాలు సజావుగా సాగేలా చూడాల్సింది పోయి తమ వంతుగా ఇబ్బందులను తెచ్చే పనులు చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్టను బజారుకెక్కిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : ఎస్పీ

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-నార్పల

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ పిల్లలు స్మార్ట్‌ఫోన్లలో సోషల్ మీడియా వినియోగిస్తున్న సమయంలో, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం వల్ల డబ్బులు పోయే అవకాశం ఉంటుందన్నారు. అంతేగాకుండా వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కెవిపిఎస్ నేతల వినతి

వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నేతలు, కాటి కాపరులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్మశాన వాటికల్లో గుంతలు తీసి మృతదేహాలను పూడ్చి, కాల్చే కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఏ రకంగా చనిపోయినా ఆ మనిషికి శ్మశానంలో గుంతలు తీసి పూడ్చడమో.. కట్టెలు పేర్చి కాల్చడమో చేసే వృత్తిని తరతరాలుగా నిర్వహిస్తూ వస్తున్నా నేటికీ ప్రభుత్వం ఒకవృత్తిగా గుర్తించడం లేదన్నారు. శ్మశానమే రోజువారి అవసరంగా తిరిగే వారికి ఎటువంటి బతుకు భద్రత లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాటికాపురలకు గుర్తింపు కార్డులు ఇచ్చి 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలన్నారు. వయసు నిండిన వారిందరికీ రూ.8000 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. వత్తి పరికరాలు గడ్డపార, రెండు చెలికలు, రెండు గంపలు, గ్లౌజ్, బూట్లు, డ్రస్సులు ఇవ్వాలన్నారు. ప్రమాద భీమా, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జీవరత్నం, రాజా, నాగేంద్ర, పుష్ప రాజ్, పుల్లన్న, శీను, శివ తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తులకు అన్నదానం

14ఏళ్లుగా కొనసాగిస్తున్న ఆర్‌టి కాంతారావు

హాటకేశ్వరం వద్ద అన్నదానం చేస్తున్న ఆర్‌టి కాంతారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

శివరాత్రిని పురస్కరించుకుని నంద్యాల జిల్లా శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రాయదుర్గానికి చెందిన కాంట్రాక్టర్ ఆర్‌టి కాంతారెడ్డి అన్నదానం ప్రారంభించారు. కాంతారెడ్డి దాదాపు 14ఏళ్లుగా భక్తులకు అన్నదానం చేయడం కొనసాగిస్తున్నారు. సాధారణంగా శివమాలదారులు వేలాదిగా శివరాత్రికి శ్రీశైలం ముందుగానే కాలినడకన వెళ్తుంటారు. కాలినడకన వెళ్లే వారికి అరణ్యంలో ఏమీ దొరకదు. దీన్ని గుర్తించిన కాంతారెడ్డి మిత్రబృందం 14ఏళ్లుగా హటకేశ్వరం వద్ద అన్నదానం చేస్తున్నారు. శివరాత్రికి నాలుగు రోజులు ముందుగానే రాయదుర్గం నుంచి వంట, వస్తు సామగ్రితో హాటకేశ్వరం చేరుకుని అన్నదానం ప్రారంభిస్తారు. దైవ చింతనతో మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు తనవంతుగా చేస్తున్న అన్నదానంతో తృప్తి కలుగుతుందని కాంతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం జడ్పిటిసి హొన్నె మల్లికార్జున, మధుసూదన్‌రెడ్డి, తిప్పారెడ్డి, రామన్న, తదితరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల అవసరం మేరకే గిడ్డంగుల ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి అవసరం మేరకు గిడ్డంగులు ఏర్పాటు చేసినట్లు ఐసిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, జిల్లా సహకార అధికారిణి అరుణకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక రాచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులకు నగరంలోని ఎపి గిడ్డంగుల సంస్థ ఆవరణలో ఐసిఎం, గిడ్డంగి నియంత్రణ అభివృద్ధి అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సమృద్ధిలో భాగంగా ఎంపిఎఫ్‌సి గోడౌన్లను, కంప్యూటరీకరణ, కామన్ సర్వీస్ సెంటర్లు, జనరిక్ మెడిసిన్స్ మొదలైన సేవలను పిఎసిఎస్ ద్వారా అందిస్తున్నారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల మేనేజర్ ఖాన్, రాచానపల్లి సహకార సంఘం సొసైటీ సిఇఒ శ్రీనివాస్, సహకార సంఘం పిఐసి అసిస్టెంట్ రిజిస్ట్రార్ రోషన్‌జమీర్, రైతులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

పెద్దవడుగూరు : మండలంలోని పలుగ్రామాల్లో వెలసిన శివాలయాల్లో బుధవారం జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పెద్దవడుగూరులోని పేట ఉమామహేశ్వర, చింతలచెరువులో జోడిలింగేశ్వర, చిన్నవడుగూరులో సిద్దేశ్వరస్వామి, కాశేపల్లి, ఆవులాంపల్లి, మిడుతూరు, కొట్టాలపల్లి, దిమ్మగుడి, మేడిమాకులపల్లి, లక్షుంపల్లి గ్రామాల్లోని శివాలయాలను రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

జాబ్‌మేళాలో 29 మందికి ఉద్యోగాలు

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 29 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంస్థ ఛైర్మన్ దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎడిఎంఎస్ మార్కెటింగ్ ప్రయివేట్ లిమిటెడ్, పేటీఎం, సిఐఎల్ ఈనాడు వంటి కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ–సీడాప్ ప్రతినిధి సావిత్రమ్మ, ఎపిఎస్ ఎస్‌డిసి కోఆర్డినేటర్ రాము, కంపెనీల ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

అనంతపురం సిటీ : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఓ పేద కుటుంబానికి మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతపురం రూరల్ సోములదొడ్డి గ్రామంలో నివాసం ఉంటున్న చౌడప్ప అనే వృద్ధుడి కుటుంబానికి 31 రకాల నిత్యావసర సరుకులు, బియ్యం ప్యాకెట్‌ను అందించినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మాజీ సర్పంచి వెంకటలక్ష్మి, చాముండేశ్వరి, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని ఇఒపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ : ఉరవకొండ గవిమఠం సంస్థానంలో మార్చి 9న జరిగే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల విడుదలలో ప్రొటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆలయ ఇఒపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన గవిమఠం ఉత్సవాల కార్యక్రమాలను పార్టీలు, కులాలకు అతీతంగా నిర్వహించాల్సిన ఆలయ అధికారులు వారికి నచ్చిన విధానంలో ఇష్టానుసారంగా వ్యవహరించి సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆహ్వాన పత్రికల్లో ఎవరి పేర్లు ఉండాలనే కనీస పరిజ్ఞానం లేకుండా ఎలా విధులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్సవాలకు ముస్తాబవుతున్న చెన్నకేశవస్వామి ఆలయం

యాడికి : మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న శివలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈనెల 14వతేదీన నిర్వహించనున్న తిరుణాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ గాలిగోపురం, ప్రహరీలను తాడిపత్రి అగ్నిమాపక సిబ్బంది సాయంతో శుభ్రం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

అధికారులతో మాట్లాడుతున్న టిసి వరుణ్

అనంతపురం రూరల్ : అహుడా పరిధిలో ఉన్న అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామని అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని అహుడా కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహుడా పరిధిలో అనధికార లే అవుట్లకు ఆస్కారమే లేకుండా పని చేస్తామన్నారు. లే అవుట్ల ఏర్పాటులో ప్రభుత్వం నియమ, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పర్యటిస్తున్నాయన్నారు. అన్ని లే అవుట్లను జల్లెడ పట్టి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై శిక్షణ

మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

పుట్లూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాట్సప్ గవర్నెన్స్ సేవలపై ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా వాట్సప్ కులం, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలను ఎలా దరఖాస్తు చేయాలన్న విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

యాడికి : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్, పెద్దపేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో 32 మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగేశ్వరయ్య, ఎన్.నాగరాజు, నవనీతమ్మ, జయలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ప్రమీల, కె.రాజేశ్వరీబాయి, ఎపి మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, పిజిటి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవ గోడపత్రికలు విడుదల

ఉరవకొండ : ఉరవకొండ గవిమఠం సంస్థానంలో మార్చి 9న నిర్వహించనున్న రథోత్సవ ఆహ్వాన గోడ పత్రికలను సహాయ కమిషనర్ కె.రాణి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం నాయకులు ఆర్‌డిటి మల్లికార్జున, గంగాధర్, నాగన్నగౌడ్, నిరంజన్‌గౌడ్, బొజ్జప్ప, ఆమిద్యాల యోగేష్‌స్వామి, రాకెట్ల వీరేశ్ స్వామి, మోపిడి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన యాడికి వైసిపి నాయకులు

యాడికి : వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని పులివెందులలోని కార్యాలయంలో యాడికి వైసిపి సీనియర్ నాయకులు బాల రమేష్‌బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా మండలంలోని సమస్యలపై చర్చించారు. ప్రతి కార్యకర్త పార్టీకి సైనికుడిలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిన్నేపల్లె శేఖర్‌రెడ్డి, చింతలాయపల్లి రోషిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు

సెక్యూరిటీ గార్డు పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ పరిధిలో ఉన్న మరూరు టోల్‌ప్లాజాలో సెక్యూరిటీ గార్డు కోసం శంకర్ గ్లోబల్ లిమిటెడ్ వారు కోరినట్టుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆసక్తి ఉన్న మాజీ సైనికులు ఈనెల 28వ తేదీలోపు జిల్లాకేంద్రంలోని సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

రైళ్లలో నేరాల నియంత్రణకు చర్యలు

డ్రోన్ ద్వారా తనిఖీ చేస్తున్న అధికారులు

గుత్తి : గుత్తి, తాడిపత్రి రైల్వే జంక్షన్ల పరిధిలోని రైళ్లలో ఎలాంటి నేరాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టామని జిఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు. మంగళవారం గుత్తి రైల్వే స్టేషన్ నుంచి తాడిపత్రి వరకు నేరాలు జరిగే ప్రాంతాల్లో జిఆర్పీ పోలీసులు డ్రోన్ కెమెరా ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జిఆర్పీ ఎస్ఐ నాగప్ప మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని రైళ్లలో నేరాలను అరికడదామన్నారు. కార్యక్రమంలో జిఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ఆర్పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడి తప్పనిసరి

మాట్లాడుతున్న ఎఒ ముస్తాక్‌అహ్మద్

గుత్తి : భూమి ఉన్న ప్రతి రైతుకు యూనిక్ ఐడి (విశిష్ట గుర్తింపుసంఖ్య) తప్పనిసరి అని మండల వ్యవసాయధికారి ముస్తాక్ అహ్మద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో రైతుల యూనిక్ ఐడి నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లడుతూ ఈ రిజిస్ట్రేషన్ వల్ల రైతులకు సబ్సిడీ విత్తనాలు, పంట నమోదు, పంట ఉత్పత్తులను మద్దతు ధరలతో విక్రయించడానికి, పంట నష్టపరిహారం పొందడానికి, వ్యవసాయ పరికరాలు సబ్సిడీ ధరలపై పొందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒలు మెర్సీ, రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న గౌని

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని బిసివై పార్టీ రాయదుర్గం అధ్యక్షులు గౌని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.17కోట్లతో నిర్మాణం చేపట్టాల్సిన భవనాలను పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి ముందు సెల్ఫీ వీడియో తీసి తనను గెలిపిస్తే నిధులు తీసుకొచ్చి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆర్థికశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన పయ్యావుల కేశవ్ ఉన్నందున వెంటనే నిధులు విడుదల చేసి అసంపూర్తిగా ఉన్న ఆసుపత్రి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై కర్రలతో దాడి

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తిపై కొందరు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పరంధాముడు పని నిమిత్తం సచివాలయంలోకి వెళ్లాడు. అక్కడ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతుండగా అదేగ్రామానికి చెందిన ఓబిలేసు అక్కడికి వెళ్లి తనకు మర్యాద ఇవ్వలేదని పరంధాముడుతో గొడవకు దిగాడు. ఓబిలేసు తన కుటుంబ సభ్యులతో కలిసి కర్రలతో పరంధాముడుపై దాడి చేశారు. దీంతో తీవ్రం గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.